

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | సోమవారం 10-11-2025 | సంపుటి - 25 | సంచిక -175 | రూ : 4 | పేజీలు: 8


## హైదరాబాద్‌ను వణికిస్తున్న చలి..

పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు



2లో



2లో

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ముగిసిన ప్రచారం..

- నవంబరు 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్
- బరిలో 58 మంది అభ్యర్థులు
- ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య పోటీ
- నవంబరు 14న ఓట్ల లెక్కింపు

## పోస్టల్ సేవలు ఇక మరింత సులభం

వచ్చేసింది 'డాక్ సేవా' యాప్




2లో

- తపాలా శాఖ నుంచి కొత్త 'డాక్ సేవా' యాప్
- పాత 'పోస్ట్ ఇన్ఫో' యాప్ స్థానంలో నూతన యాప్
- ఒకే యాప్‌లో 8 రకాల ముఖ్యమైన సేవలు
- స్పీడ్ పోస్ట్, పార్శిల్ ట్రాకింగ్ ఇక చాలా సులభం
- పోస్టేజ్, ఇన్సూరెన్స్ ప్రీమియంల లెక్కింపు సౌకర్యం
- గూగుల్, ఆపిల్ స్టోర్లలో ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు

## రేవంత్ మూడేళ్లు ఉంటారో.. మూణ్నెల్లు ఉంటారో..

- జూబ్లీహిల్స్‌లో తీర్పుతో తేలిపోతుంది
- రాష్ట్ర ప్రజలకు న్యాయం చేసే అవకాశం ఇక్కడి ఓటర్లకు దక్కింది
- భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



2లో

## 5 రాష్ట్రాల్లో తెలంగాణ సైబర్ బ్యూరో మెగా ఆపరేషన్...



2లో

## అభివృద్ధి కోసం చంద్రబాబు, వైఎస్ విధానాలను ఫాలో అవుతున్నాం

2లో

- ఐటీ, ఫార్మా రంగాలను వారు ప్రోత్సహించారన్న ముఖ్యమంత్రి
- ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో కీలక వ్యాఖ్యలు
- ఐటీ రంగానికి పునాది వేసిన నేత నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి



## కోటి దీపోత్సవానికి రాష్ట్ర పండుగ హోదా: రేవంత్‌రెడ్డి





2లో

- వచ్చే ఏడాది నుంచి అధికారికంగా ఉత్సవాల నిర్వహణ
- జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానని వెల్లడి
- ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న కార్యక్రమంలో సతీసమేతంగా పాల్గొన్న సీఎం
- పుట్టినరోజు వేడుకలను భక్తుల మధ్య జరుపుకోవడం ఆనందంగా ఉందన్న రేవంత్



2లో

## ఎన్ని ఉన్నా.. ఆరోగ్యం లేకపోతే వ్యర్థం

- గుంటూరు పెదకాకానిలో శంకర కంటి ఆసుపత్రి నూతన భవనం ప్రారంభం
- ఇంటి వద్దకే ప్రపంచస్థాయి వైద్యం అందించే 'సంజీవని' ప్రాజెక్టు ప్రకటన
- రాష్ట్రంలోని 5 కోట్ల మంది ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేస్తామని వెల్లడి
- ఆరోగ్య రంగంలో ఏపీని ప్రపంచానికి రోల్ మోడల్‌గా నిలుపుతామని చంద్రబాబు ధీమా
- అనారోగ్యమే అసలైన పేదరికం అని వ్యాఖ్యానించిన ముఖ్యమంత్రి
- శంకర ఫౌండేషన్ సేవలను కొనియాడిన సీఎం.. 30 లక్షల మందికి ఉచిత సర్జరీలు

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక: ముగిసిన ప్రచారం.. ఎల్లుండి పోలింగ్

హైదరాబాద్, నవంబర్ 09 : జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారానికి నేటితో తెరపడింది. గత కొన్ని రోజులుగా హోరాహోరీగా సాగిన ప్రచార పర్వం ఆదివారం సాయంత్రంతో ముగిసింది. ఎల్లుండి (నవంబరు 11, మంగళవారం) పోలింగ్ జరగనుండగా, ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఉప ఎన్నికలో ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య ముక్కోణపు పోటీ నెలకొంది. బీఆర్ఎస్ తరఫున మాగంటి సునీత, కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బీజేపీ అభ్యర్థిగా దీపక్ రెడ్డి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. వీరితో పాటు మొత్తం 58 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ప్రధాన పార్టీల నేతలంతా చివరి రోజు వరకు విస్తృతంగా ప్రచారం నిర్వహించి ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో మొత్తం 4,01,365 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందుకోసం







ఎన్నికల సంఘం 407 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ముఖ్యంగా 139 సమస్యాత్మక ప్రాంతాల్లో డ్రోన్లతో నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. నవంబరు 11న పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం, ఈ నెల 14న ఓట్ల లెక్కింపు చేపట్టి అదే రోజు ఫలితాన్ని వెల్లడిస్తారు. దీంతో అభ్యర్థుల భవితవ్యం తేలిపోనుంది.

## హైదరాబాద్‌ను వణికిస్తున్న చలి.. పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, నవంబర్ 09 : హైదరాబాద్‌లో చలి తీవ్రత క్రమంగా పెరుగుతోంది. గత మూడు రోజులుగా రాత్రి సమయాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. దీంతో భాగ్యనగరవాసులు చలికి వణికిపోతున్నారు. ముఖ్యంగా తెల్లవారుజామున చలిగాలుల ప్రభావం అధికంగా ఉంటోంది. వాతావరణ శాఖ అధికారుల వివరాల ప్రకారం శనివారం నగరంలో 16 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణం కంటే తక్కువని వారు వెల్లడించారు. రాత్రి వేళల్లో చలి తీవ్రత పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పూట కూడా మంచు ప్రభావం కనిపిస్తోంది. నగర కేంద్రంతో పోలిస్తే శివారు ప్రాంతాల్లో చలి ప్రభావం మరింత ఎక్కువగా ఉంది. పటాన్‌చెరులో అత్యల్పంగా 14 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, దుండిగల్‌లో 15 డిగ్రీలు, హయత్‌నగర్‌లో 17, హకీంపేటలో 17.1, రాజేంద్రనగర్‌లో 18 డిగ్రీల చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు. రానున్న రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

## అభివృద్ధి కోసం చంద్రబాబు, వైఎస్ విధానాలను ఫాలో అవుతున్నాం : రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 09 : తెలంగాణ అభివృద్ధికి ఉమ్మడి రాష్ట్రంలో నాటి ముఖ్యమంత్రులు చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి అవలంభించిన విధానాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వారి హయాంలో ఐటీ, ఫార్మా రంగాలకు విశేష ప్రాధాన్యం దక్కిందని గుర్తుచేశారు. ఐటీ రంగానికి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి వేసిన పునాది హైదరాబాద్ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో రేవంత్ రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రుల నిర్ణయాలు హైదరాబాద్ అభివృద్ధికి బాటలు వేశాయని రేవంత్ రెడ్డి చెప్పారు. నగరం నాలెడ్జ్ సిటీగా మారిందంటే కారణం గతంలో కాంగ్రెస్ సీఎంలు తీసుకున్న నిర్ణయాలేనని అన్నారు. అభివృద్ధిలోనే కాదు.. సంక్షేమంలోనూ కాంగ్రెస్ ముఖ్యమంత్రులు తమ ముద్ర వేశారని వివరించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో వచ్చిన శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఓఆర్ఆర్ కూడా కీలకంగా మారాయన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలోనే అనేక కేంద్ర సంస్థలు హైదరాబాద్‌లో ఏర్పాటయ్యాయని చెప్పారు. దేశానికి వచ్చిన వాటిలో 70 శాతం నగరానికే వచ్చాయని, ప్రపంచాన్ని శాసించే చాలా సంస్థలు హైదరాబాద్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం జీసీసీలు, డేటా సెంటర్లకు హైదరాబాద్ హబ్‌గా మారిందని గుర్తుచేశారు. 20042014 మధ్య అటు కేంద్రం, ఇటు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలు హైదరాబాద్ అభివృద్ధికి పాటుపడ్డాయని రేవంత్ రెడ్డి తెలిపారు.

## కోటి దీపోత్సవానికి రాష్ట్ర పండుగ హోదా: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 09 : హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో భక్తి టీవీ ఆధ్వర్యంలో జరుగుతున్న కోటి దీపోత్సవ కార్యక్రమాన్ని వచ్చే ఏడాది నుంచి 'రాష్ట్ర పండుగ'గా, అధికారిక ఉత్సవంగా నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కార్తీక మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన తన అర్ధాంగితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కోటి దీపోత్సవాన్ని జాతీయ పండుగగా గుర్తించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానని చెప్పారు. కొన్ని రోజుల క్రితం ఇదే వేదికపై కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిస్తే జాతీయ గుర్తింపు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ప్రకటనకు ప్రాధాన్యం సంతరించుకుంది. తన పుట్టిన రోజున, నాలుగు కోట్ల మంది ప్రజలకు వేదికగా నిలుస్తున్న ఇంతటి పవిత్ర కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అల్జీపురం మఠం పీఠాధిపతి శ్రీవామనాశ్రమ స్వామి.. ముఖ్యమంత్రి దంపతులను ఆశీర్వదించారు. ఈ వేడుకలో ఎన్టీవీ అధినేత నరేంద్ర చౌదరి దంపతులు, పలువురు స్వామీజీలు, వేలాదిగా భక్తులు పాల్గొన్నారు.

## 5 రాష్ట్రాల్లో తెలంగాణ సైబర్ బ్యూరో మెగా ఆపరేషన్...

- * ఏపీ సహా పలు రాష్ట్రాల్లో 81 మంది సైబర్ నేరగాళ్ల అరెస్ట్
- * దేశవ్యాప్తంగా 754 కేసుల్లో నిందితులుగా గుర్తింపు
- * మొత్తం రూ.95 కోట్ల మేర మోసాలకు పాల్పడిన ముఠా
- * నిందితుల ఖాతాల్లోని కోట్లాది రూపాయలు ఫ్రీజ్
- * డబ్బును బాధితులకు తిరిగి అందజేస్తామన్న పోలీసులు



హైదరాబాద్, నవంబర్ 09 : తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన భారీ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. ఐదు రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించి, రూ.95 కోట్ల మేర మోసాలకు పాల్పడిన 81 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసింది. వీరిపై దేశవ్యాప్తంగా 754 కేసులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తెలంగాణ పోలీసుల కథనం ప్రకారం, సైబర్ నేరగాళ్ల కదలికలపై నిఘా పెట్టిన సైబర్ సెక్యూరిటీ బ్యూరో... ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు చేపట్టింది. ఈ ఆపరేషన్‌లో మొత్తం 81 మందిని అదుపులోకి తీసుకుంది. అరెస్టయిన వారిలో 17 మంది ఏజెంట్లు, ఏడుగురు మహిళలు, 58 మంది మ్యూల్ ఖాతాదారులు ఉన్నారు. నిందితుల నుంచి 84 సెల్‌ఫోన్లు, 101 సిమ్ కార్డులు, 89 బ్యాంకు పాస్‌బుక్‌లు, చెక్‌బుక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠా సభ్యుల బ్యాంకు ఖాతాల్లో ఉన్న కోట్లాది రూపాయల నగదును సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఫ్రీజ్ చేశారు. చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత ఈ మొత్తాన్ని బాధితులకు తిరిగి అందజేయనున్నట్లు వారు వెల్లడించారు. ఈ అరెస్టులతో దేశంలోని అనేక సైబర్ నేరాలకు అడ్డుకట్ట పడినట్లయిందని అధికారులు తెలిపారు.

## జపాన్ లో భారీ భూకంపం... సునామీ హెచ్చరికలు జారీ

జపాన్, నవంబర్ 09: జపాన్‌లో ఆదివారం భారీ భూకంపం సంభవించింది. దేశ ఈశాన్య ప్రాంతంలోని పసిఫిక్ మహాసముద్రంలో రిక్టర్ స్కేలుపై 6.7 తీవ్రతతో భూమి కంపించడంతో అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. ఈ భూకంపం కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా, బుల్లెట్ రైలు సర్వీసులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. జపాన్ వాతావరణ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 5:03 గంటలకు సంరికు తీరానికి సమీపంలో, సముద్ర గర్భంలో 10 కిలోమీటర్ల లోతున భూకంప కేంద్రాన్ని గుర్తించారు. భూకంపం కారణంగా ఇవాతె రాష్ట్ర తీరాన్నిమీటరు ఎత్తు వరకు సునామీ అలలు తాకే ప్రమాదం ఉందని వాతావరణ సంస్థ హెచ్చరించింది. ఒఫునాటోలో 10 సెంటీమీటర్ల ఎత్తున, మియాకోలో ఓ మోస్తరు అలలు తీరాన్ని తాకినట్లు అధికారులు తెలిపారు. భూకంపం కారణంగా తాత్కాలికంగా నిలిపివేసిన తొహోకు షింకన్‌సెన్ బుల్లెట్ రైలు సర్వీసులను కొద్దిసేపటికే పునరుద్ధరించినట్లు ఆపరేటర్ జేఆర్ ఈస్ట్ ప్రకటించింది. ఈ ఘటనపై జపాన్ ప్రధాని సనాయె తకైచి 'ఎక్స్' వేదికగా స్పందించారు. "సునామీ హెచ్చరిక జారీ చేయబడింది, కాబట్టి దయచేసి వెంటనే తీరం నుంచి దూరంగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లండి. ఊహించిన దాని కంటే పెద్ద సునామీ రావచ్చు, కాబట్టి తదుపరి సమాచారం కోసం అప్రమత్తంగా ఉండండి. భూకంపం తర్వాత కూడా ప్రకంపనలు వచ్చే అవకాశం ఉంది" అని ఆమె ప్రజలను హెచ్చరించారు. మియాగి రాష్ట్రంలోని ఒనగావా అణు విద్యుత్ కేంద్రంలో ఎలాంటి నష్టం నమోదు కాలేదని, ప్లాంట్‌కు ఎటువంటి ప్రమాదం లేదని తొహోకు ఎలక్ట్రిక్ పవర్ సంస్థ స్పష్టం చేసింది. అయితే, రానున్న కొద్ది రోజుల్లో ఇదే తీవ్రతతో లేదా అంతకంటే శక్తివంతమైన భూకంపాలు సంభవించే ప్రమాదం ఉందని, సునామీ హెచ్చరికలున్న ప్రాంతాల్లో ప్రజలు సముద్ర తీరానికి వెళ్లవద్దని వాతావరణ సంస్థ అధికారి ఒకరు మీడియా సమావేశంలో సూచించారు.

## పోస్టల్ సేవలు ఇక మరింత సులభం.. వచ్చేసింది 'డాక్ సేవా' యాప్

ఢిల్లీ, నవంబర్ 09 : భారత తపాలా శాఖ తన సేవలను ఆధునీకీకరించే దిశగా కీలక ముందడుగు వేసింది. సాంకేతికతను అందిపుచ్చుకుంటూ వినియోగదారులకు మెరుగైన అనుభవాన్ని అందించేందుకు 'డాక్ సేవా' పేరిట సరికొత్త మొబైల్ అప్లికేషన్‌ను ప్రారంభించింది. ఇప్పటివరకు వినియోగంలో ఉన్న పాత 'పోస్ట్ ఇన్ఫో' యాప్ స్థానంలో ఈ కొత్త యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ పోస్టల్ టెక్నాలజీ రూపొందించిన ఈ 'డాక్ సేవా' యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ లేదా ఆపిల్ యాప్ స్టోర్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఆధునిక సాఫ్ట్‌వేర్, సులభమైన ఇంటర్‌ఫేస్‌తో ఈ యాప్ వినియోగదారులకు సౌకర్యవంతంగా ఉంటుందని తపాలా శాఖ తెలిపింది. ఈ యాప్ ద్వారా వినియోగదారులు పోస్ట్ ఆఫీసులకు వెళ్లకుండానే తమ పనులను చక్కబెట్టుకోవచ్చు.

### ఒకే యాప్‌లో 8 రకాల సేవలు

ఈ ఒక్క యాప్‌తో దాదాపు 8 రకాల కీలక సేవలను పొందవచ్చు. స్పీడ్ పోస్ట్, రిజిస్టర్డ్ పోస్ట్, పార్శిళ్లను రియల్ టైమ్‌లో ట్రాక్ చేయడం, సమీపంలోని పోస్ట్ ఆఫీస్ వివరాలు, పనివేళలు తెలుసుకోవడం వంటివి చాలా సులభం. అంతేకాకుండా పంపించాలనుకుంటున్న పార్శిల్ బరువు, గమ్యస్థానాన్ని బట్టి పోస్టేజ్ ఛార్జీలను ముందుగానే లెక్కించుకోవచ్చు. ఇక, ఆర్థిక సేవలు కూడా ఈ యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ , రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రీమియంలను లెక్కించుకోవచ్చు. సుకన్య సమృద్ధి యోజన, రికరింగ్ డిపాజిట్ వంటి పొదుపు పథకాలపై వచ్చే వడ్డీ వివరాలను కూడా తెలుసుకునే సౌకర్యం కల్పించారు. కార్పొరేట్ కస్టమర్ల కోసం ప్రత్యేక సేవలు కూడా ఇందులో ఉన్నాయి. 'తపాలా శాఖ 2.0' లక్ష్యాల్లో భాగంగా తీసుకొచ్చిన ఈ 'డాక్ సేవా' యాప్.. పోస్టల్ సేవలను డిజిటల్ యుగంలోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలన్న 'డిజిటల్ ఇండియా' లక్ష్యానికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

## రేవంత్ మూడేళ్లు ఉంటారో.. మూణ్నెల్లు ఉంటారో..

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో ఓటర్లు దిమ్మతిరిగే తీర్పు ఇస్తే.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూడేళ్లు ఉంటారో.. మూణ్నెల్లు ఉంటారో తేలిపోతుందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఒక్క సీటు కోసం సీఎం కూడా ప్రచారం చేస్తున్నారంటే.. వాళ్లు ఎంత భయపడుతున్నారో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. ఢిల్లీలో రేవంత్‌పై నల్గొండ, ఖమ్మం నేతలు కత్తులు నూరుతున్నారని.. సీఎం కుర్చీకోసం కొందరు నేతలు సిద్ధమవుతున్నారన్నారు. భారత రాష్ట్ర సమితి అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించుకుంటే 500 రోజుల్లో కేసీఆర్ ప్రభుత్వం వస్తుందని.. అందర్నీ కడుపులో పెట్టుకుని చూసుకునే బాధ్యత తమదని పేర్కొన్నారు. ఉప ఎన్నిక ప్రచారం చివరి రోజు ఆదివారం సాయంత్రం యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన ప్రసంగించారు. 'ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి తీయని మాటలు చెప్పి.. తర్వాత పైసలు లేవని చేతులెత్తేస్తారు. ఆరు గ్యారంటీలతో అన్నివర్గాలను మోసం చేసిన వ్యక్తి జూబ్లీహిల్స్‌కు న్యాయం చేస్తారా? రెండేళ్ల క్రితం ఒకసారి మోసపోయినందుకే ఇప్పటికీ అవస్థలు పడుతున్నాం. కేసీఆర్ పదేళ్ల.. రేవంత్ రెండేళ్ల పాలనను చూసి ఆలోచించి ఓటేయాలి. భారత రాష్ట్ర సమితిని గెలిపించి కాంగ్రెస్‌కు బుద్ధి చెబితేనే ఆడబిడ్డలకు రూ.2,500, వృద్ధులకు రూ.4వేల పింఛన్, దివ్యాంగులకు రూ.6వేల పింఛను పథకాలు అమలవుతాయి.

## అమెరికాలో కొనసాగుతున్న సంక్షోభం.. రెండో రోజూ 1,000కి పైగా విమానాలు రద్దు

అమెరికా, నవంబర్ 09: అమెరికాలో ప్రభుత్వ షట్‌డౌన్ ప్రభావం విమానయాన రంగంపై తీవ్రంగా పడింది. ఎయిర్ ట్రాఫిక్‌ను తగ్గించాలన్న ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (FAA) ఆదేశాలతో విమానయాన సంస్థలు వరుసగా రెండో రోజైన శనివారం కూడా 1,000కి పైగా విమానాలను రద్దు చేశాయి. దీంతో దేశంలోని ప్రధాన విమానాశ్రయాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఫ్లైట్ అవేర్ వెబ్‌సైట్ ప్రకారం నిన్న మధ్యాహ్నానికే 1,000కి పైగా విమానాలు రద్దయ్యాయి. ముఖ్యంగా నార్త్ కరోలినాలోని షార్లెట్ విమానాశ్రయంలో అత్యధికంగా 130 విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. అట్లాంటా, చికాగో, డెన్వర్, నెవార్క్ వంటి ఇతర ప్రధాన ఎయిర్‌పోర్టులలో కూడా ఇదే పరిస్థితి కనిపించింది. న్యూయార్క్ నగర పరిసరాల్లోని విమానాశ్రయాల్లో సిబ్బంది కొరత కారణంగా విమానాలు ఆలస్యంగా నడిచాయి. షట్‌డౌన్ కొనసాగితే రానున్న రోజుల్లో రద్దయ్యే విమానాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం 40 విమానాశ్రయాల్లో 4 శాతం విమానాలను తగ్గించామని, మంగళవారం నుంచి ఈ సంఖ్యను మరింత పెంచి, శుక్రవారం నాటికి 10 శాతానికి చేర్చుతామని ఎఫ్ఏఏ తెలిపింది. షట్‌డౌన్ కొనసాగి, మరింత మంది ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు విధులకు దూరమైతే మరిన్ని కోతలు విధించాల్సి వస్తుందని రవాణా శాఖ కార్యదర్శి సీన్ డఫీ హెచ్చరించారు.

### ఎందుకీ పరిస్థితి?

ప్రభుత్వ షట్‌డౌన్ కారణంగా దాదాపు నెల రోజులుగా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లకు జీతాలు అందడం లేదు. దీంతో చాలామంది అనారోగ్య కారణాలు చూపి విధులకు గైర్హాజరవుతున్నారు. ఇప్పటికే ఉన్న సిబ్బంది కొరతకు ఇది తోడవడంతో విమానాల నిర్వహణ కష్టంగా మారింది. జీతాలు లేకుండానే వారానికి ఆరు రోజులు తప్పనిసరిగా ఓవర్ టైమ్ చేయాల్సి వస్తోందని, కొందరు తమ కుటుంబ ఖర్చుల కోసం రెండో ఉద్యోగం కూడా చేసుకుంటున్నారని నేషనల్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్స్ అసోసియేషన్ తెలిపింది.

### ప్రయాణికుల ఆవేదన

ఈ ఆకస్మిక పరిణామాలతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. "మనమందరం ప్రయాణాలు చేస్తాం. అందరికీ ఎక్కడికో ఒకచోటికి వెళ్లాల్సిన అవసరం ఉంటుంది. ప్రభుత్వం ఈ సమస్యను త్వరగా పరిష్కరిస్తుందని ఆశిస్తున్నాను" అని మియామి నుంచి డొమినికన్ రిపబ్లిక్‌కు వెళుతున్న ఎమ్మా హోల్గిన్ అనే ప్రయాణికురాలు తన ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రయాణం చేయడమే ఒత్తిడితో కూడుకున్నది. దానికి తోడు ఇలాంటి అంతరాయాలు ఏర్పడితే పరిస్థితి మరింత సవాలుగా మారుతుంది" అని ప్యూర్టోరికోకు వెళుతున్న హీథర్ జు అనే మరో ప్రయాణికురాలు అన్నారు. విమానాల రద్దు ఇలాగే కొనసాగితే థ్యాంక్స్ గివింగ్ వారం నాటికి పరిస్థితి మరింత దిగజారి, పర్యాటకం, హాలిడే షిప్పింగ్‌పై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

## ఘనంగా శ్రీశ్రీశ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి దేవాలయం వార్షికోత్సవం



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేస్ 2 లోని శ్రీశ్రీశ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి దేవాలయం 15వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం నూతనంగా నిర్మించిన కల్యాణ మండపం ప్రారంభోత్సవ కార్యక్రమానికి డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హజరై కల్యాణ మండపాన్ని ప్రారంభించారు.అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దేవాలయంలో నిర్మించిన కల్యాణ మండపం అల్విన్ కాలనీ ఫేస్ 2 కాలనీ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. ఫంక్షన్ హల్ లో వివాహాది శుభకార్యాలు, సమావేశాలు, సభలు, చిన్న చిన్న ఫంక్షన్ లు జన్మదిన వేడుకలు నిర్వహించుకునేందుకు వీలుగా ఫంక్షన్ హాల్ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసి ఆశీర్వదించిన అరుణ్ గురుస్వామి కి కృతజ్ఞతలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో సమ్మారెడ్డి, భాస్కర్ రెడ్డి, యాదవ రెడ్డి, భూమయ్య, అమర్ నాథ్ స్వామి, సుధాకర్, పోశెట్టిగౌడ్, నరసింహ రెడ్డి, లింగన్న, గోపాల్ రెడ్డి, సురేష్, సత్యనారాయణ, సాయి ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేద్దాం.. నిండు ప్రాణాన్ని కాపాడుదాం

**: ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ఆపదలో ఉన్న నిండు ప్రాణాన్ని కాపాడాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. యంగ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో కొత్తగూడెం పట్టణం పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లోని సింగరేణి పాఠశాలలో ఆదివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ రోహిత్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రక్తదానం మహాదానమని, ప్రతి ఒక్కరూ విధిగా రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని అన్నారు. ప్రతి ఒక్కరూ ఓ ముగ్గురికి రక్తదానం చేయమని సలహా ఇవ్వాలని కోరారు. కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ మాట్లాడుతూ యువత రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. యంగ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ జాతీయ ఫౌండర్, అధ్యక్షుడు జేబీ బాలు మాట్లాడుతూ తమ తల్లిదండ్రులు రక్తం దొరక్కపోవడంతో పడ్డ ఇబ్బందులను మరొకరు పడవద్దని ఈ క్లబ్‌ను స్థాపించానని చెప్పారు. క్లబ్‌ను జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో ఏర్పాటు చేశానని అన్నారు. తన అభిమాన నటుడు చిరంజీవి నటించిన స్టాలిన్ మూవీలో ఇచ్చిన మెసేజ్‌ను రక్తదాన యజ్ఞంలో పాటిస్తున్నానని, తప్పకుండా పేషెంట్ వారి సైడ్ కొత్తగా మరో ముగ్గురు రక్త దాతలను తయారు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య, సీఐ కరుణాకర్, దస్తగిరి, సతీష్, నరసింహ కుమార్, సాయి కృష్ణ, రహీముద్దీన్, వీరు, రాజేష్, కమలాకర్, జుబ్బు, జయరాం, మొక్కల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 26 కిలోల ఎండు గంజాయి పట్టివేత

* **వికారాబాద్‌లో కేసు నమోదు**



వికారాబాద్,(ప్రజాస్ఫూర్తి):వికారాబాద్‌లో భారీగా 26 కిలోల ఎండు గంజాయిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. దీనికి సంబంధించి ఒక కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్ గౌడ్ తెలిపారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆదివారం వికారాబాద్ రైల్వే హాస్పిటల్ పరిసర ప్రాంతంలో గంజాయి అమ్ముతున్నారనే సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 13 పాకెట్ల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న ఈ గంజాయి విశాఖపట్నం నుంచి తీసుకువచ్చినట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ సమాచారం ఆధారంగా, రైలులో కూడా తనిఖీలు నిర్వహిస్తున్నామని పోలీసులు తెలిపారు. గంజాయి సరఫరా వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించేందుకు ఈ అక్రమ రవాణా నెట్‌వర్క్ను ఛేదించడానికి దర్యాప్తు కొనసాగుతోంది.గంజాయి వంటి మత్తుపదార్థాల అక్రమ రవాణా , అమ్మకాలపై ఎక్సైజ్ , పోలీసు అధికారులు నిఘా పెంచారు. ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలను గమనించినట్లయితే, వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

# గంజాయితో.. భవిష్యత్ అంధాకారం

* **విద్య - వైద్యం - ఉపాధి ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ లక్ష్యం**
* **గోవులను రక్షించి పోషించడమే గట్టుప్పల్ లో గో సంరక్షణ శాల**
* **ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్**





సంస్థాన్ నారాయణపురం, ప్రజాస్ఫూర్తి: నేటి యువత గంజాయికి బానిసై.. బంగారం లాంటి తమ భవిష్యత్ అంధాకారం చేసుకుంటున్నారని ఇ ఎల్ వి (ఇరగదిండ్ల లక్ష్మమ్మ వీరయ్య) భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరగదిండ్ల భాస్కర్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రం జైహింద్ ఫంక్షన్ హాల్ లో ఇ ఎల్ వి భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మునుగోడు నియోజకవర్గం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అభిమానులతో ర్యాలీగా ముందుకు సాగారు. స్వామి వివేకానంద, స్వాతంత్ర సమరయోధుడు భగత్ సింగ్, భగీరథ మహర్షి, బాపూజీ, బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రాచీన శివాలయం వద్ద అభిమానులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయం నుంచి ఫంక్షన్ హాల్ వరకు పాదయాత్ర చేశారు. ఫంక్షన్ హాల్ లో ఇ ఎల్ వి భాస్కర్ కు యువత ఘన స్వాగతం పలికారు. అభిమానులకు అభివాదం చేస్తూ సభ వేదిక చేరుకున్నారు. ఈ సందర్భంగా ఇ ఎల్ వి భాస్కర్ మాట్లాడుతూ నిరుపేదలకు విద్య వైద్యం ఉపాధి అందించడమే లక్ష్యంగా ఈ ఎల్వి ఫౌండేషన్ ఏర్పాటు చేశానన్నారు. ఈ ఫౌండేషన్ సేవలు మునుగోడు నియోజకవర్గానికి పరిమితం కావని, ఉమ్మడి నల్లగొండ ప్రాంతంలో ఎక్కడైనా నిరుపేదలకు సాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. నేటి యువత గంజాయి తాగుతూ తమ బంగారు భవిష్యత్తు వ్యర్థం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి రూపుమాపేందుకు ఫౌండేషన్ కృషి చేస్తుందన్నారు. గంజాయి సరఫరా చేసే వ్యక్తుల సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారికి రూ.10వేల నగదు ప్రోత్సాహకం ప్రకటించారు. గోవులను అక్రమంగా తరలిస్తున్నారని, గోవులను రక్షించడానికి ఏదైనా చేయాలని నిర్ణయించుకున్నానన్నారు. గట్టుప్పల్ లోని తన 11ఎకరాల భూమిలో గో సంరక్షణ శాల ఏర్పాటుకు పూనుకున్నానని తెలిపారు. యువతకు అండగా ఉండి వాళ్లకు వృత్తి నైపుణ్యం, ఉపాధి కల్పనకు తన సాయి శక్తుల కృషి చేస్తానన్నారు. యువత తమకు నచ్చిన రంగంలో వ్యాపారం చేయడానికి సైతం బ్యాంకులను సంప్రదించి లోన్లు ఇప్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నానన్నారు. ఆరుగాలం కష్టపడి శ్రమించి పండించిన రైతులు ధాన్యం అమ్ముకునే పరిస్థితి లేదని, వర్షాలకు ధాన్యం తడిసి ముద్దయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఐకెపి సెంటర్లలో ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దవ్వడంతో రైతులు కన్నీరు అయ్యారన్నారు. ఐకెపి సెంటర్లలో ధాన్యం నిల్వ చేసుకునేందుకు వీలుగా షెడ్లు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కందరాల క్షీణిత బాధితులకు ఎప్పటికీ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వారి పూర్తి బాధ్యత తీసుకుంటున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇ ఎల్ వి ఫౌండేషన్ డైరెక్టర్ ఇరగదిండ్ల అశోక్, ఇ ఎల్ వి ఫౌండేషన్ సభ్యులు, యువత, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోండి

* **కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ**

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఆదాయ పరిమితికి లోబడి ఉన్నవారు, షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందినవారు, మహిళలు, పిల్లలు, దివ్యాంగుల వంటి వారికి ఉచిత న్యాయ సేవలు అందుబాటులో ఉన్నాయని, న్యాయపరమైన సమస్యలు ఏమైనా ఉంటే ఉచిత సేవలను సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ అన్నారు. జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా ఆదివారం మండల పరిధిలోని వికలాంగుల కాలనీలో న్యాయ అవగాహనా కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లక్కినేని సత్యనారాయణ మాట్లాడుతూ సమాజంలోని బలహీన వర్గాల వారికి, దివ్యాంగులకు న్యాయ సహాయం పొందడంలో ఉన్న హక్కులు, అవకాశాల గురించి వివరించారు. ఆర్థిక, సామాజిక లేదా ఇతర కారణాల వల్ల న్యాయ సహాయం పొందలేని వారికి ఉచితంగా, సమర్థవంతంగా న్యాయ సేవలు అందించడమే ఈ దినోత్సవం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని చెప్పారు. న్యాయ సేవల అధికార సంస్థల చట్టం-1987 అమలులోకి వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని దీనిని ప్రతి సంవత్సరం నవంబర్ 9న జరుపుకుంటారని తెలిపారు. ఉచిత న్యాయ సహాయ పథకాలు, లోక్ అదాలత్, మధ్యవర్తిత్వం, పారా లీగల్ వాలంటీర్ల సేవలు, దివ్యాంగుల హక్కులు, చట్టాలు వంటి అంశాలపై కాలనీవాసులకు విపులంగా వివరించారు. స్పెషల్ జ్యూడిషల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ మెండు రాజమల్లు మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానులేనని పేర్కొన్నారు. పేదలు ఎలాంటి ఖర్చు లేకుండా న్యాయసేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సేవలు పొందవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి.నిరంజన్ రావు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు జె. గోపికృష్ణ, న్యాయవాదులు ఎరప్రాటి కృష్ణ, హరి, దేవేందర్, పారా లీగల్ వాలంటీర్స్ బి. బీక్షమయ్య, ఎం. జానకిరామ్, కె. వీరభద్రం, బి. రాజమణి, ఎ.జి.వో రమాదేవి, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## బతుకు భరోసా అనే పేరుతో ఆత్మీయ సమ్మేళనం



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : గాజులరామారం సర్కిల్ చింతల్ డివిజన్ పరిధి ఐడిపిఎల్ లోని ఎల్ ఎస్ ఫంక్షన్ హాల్లో ధన్వంతరి ఆర్ ఎమ్ పి , పి ఎమ్ పి జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో బతుకు భరోసా అనే పేరుతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి వివిధ మండలాలలోని ప్రథమ చికిత్సనందిస్తున్న సభ్యులు ఒక్కతాటిపైకి వచ్చి ధన్వంతరి ఆర్ ఎమ్ పి , పి ఎమ్ పి జాయింట్ యాక్షన్ కమిటీ గా ఏర్పడి ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చిలగాని శోభన్ బాబు, కుర్ర రవీందర్ గౌడ్, కీలుకాని భాస్కర్, వంగరి విష్ణు, పెండెం నాగభూషణం, కూచన సమ్మయ్య, ఘంటా ధన్ రాజ్, యరమాద హరి నారాయణ మాట్లాడుతూ సమస్య మాది, పరిష్కారం కూడా మాదే అనే నినాదం తో జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ మండలాల నుండి సుమారు ఐదు వందల మంది సభ్యులు హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

## పేదవారికి అండగా 'రెడీ టు సర్వ్' ఫౌండేషన్

**గాంధీ ఆసుపత్రి వద్ద ఉచిత అన్నదానం!**



ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్ : పేదరికం, ఆకలితో అల్లాడుతున్న వారికి, ఆసుపత్రిలో రోగులకు సహాయకులుగా వచ్చిన వారికి అండగా నిలుస్తూ 'రెడీ టు సర్వ్' ఫౌండేషన్ విశిష్ట సేవలు అందిస్తోంది. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రి వద్ద ఉచిత అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి వద్దకు వచ్చిన దాదాపు 300 మందికి పైగా పేదలకు, రోగుల సహాయకులకు కడుపునిండా భోజనం అందించారు. ప్రతి ఆదివారం హైదరాబాద్‌లోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద నిరాటంకంగా ఈ అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, పేదలు ఆకలితో ఉండకూడదనే లక్ష్యంతో ఈ సేవలను కొనసాగిస్తున్నామని ఫౌండేషన్ నిర్వాహకులు పెద్ది శంకర్ తెలిపారు. ఈ నిరంతర సేవ కార్యక్రమంలో వాలంటీర్లుగా పాల్గొనాలనుకునే వారు లేదా ఈ సేవలకు సహకరించాలనుకునే వారు తమను సంప్రదించవచ్చని 'రెడీ టు సర్వ్' నిర్వాహకులు కోరారు.

## కాలనీ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తా

* **ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**



ప్రజాస్ఫూర్తి, కాప్రా : ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని కాలనీల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు.ఆదివారం కాప్రా డివిజన్ పరిధిలోని వినాయక నగర్ ఫేస్ 3 లో రూ.10 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు ప్రారంభానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు బైరి నవీన్ గౌడ్ , బద్రుద్దిన్ ,ఇంద్రయ్య మహేష్ ,గిల్బర్ట్ ,రవీందర్ ,చందు , కాలనీ ప్రెసిడెంట్ అనిల్ కుమార్ , వైస్ ప్రెసిడెంట్ రాజేందర్ , సెక్రటరీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ ని భారీ మెజార్టీతో గెలిపించాలి

*** బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్పూర్తి) : నవంబర్ 11న జరిగే ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గోపీనాథ్ కి మూడవ నెంబర్ పై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా చివరి రోజు వీకర్ సెక్షన్ కాలనీ, సాయిబాబా నగర్, బాబా సైలానీ నగర్, స్వరాజ్ నగర్ లతో పాటు పలు కాలనీలలో బోరబండ డివిజన్ ఇంచార్జ్, బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ తో కలిసి బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్ కి మద్దతుగా పాదయాత్ర ద్వారా ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అందించిన సంక్షేమం మరో మారు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్ గెలుపుకు బాటలు వేస్తాయన్నారు. గత 12 ఏళ్ల కాలంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి మాగంటి గోపీనాథ్ చేసిన కృషి, ఇంటింట ప్రచారం ద్వారా ప్రజలకు చేరుతున్న తరుణంలో ప్రజల



నుంచి వస్తున్న స్పందనతో టిఆర్ఎస్ గెలుపు ఖాయమైందన్నారు. మెజార్టీ మాత్రమే తెలియాల్సి ఉందన్నారు.. బిఆర్ఎస్ గెలుపు కేవలం జూబ్లీహిల్స్ వరకే పరిమితం కాదని, బిఆర్ఎస్ అభ్యర్థి గెలుపుతో కాంగ్రెస్ పార్టీకి చెంపపెట్టు లాంటి సమాధానం ఇవ్వాలన్నారు. తెలంగాణ అభివృద్ధి, తెలంగాణ ప్రజల సంక్షేమం తిరిగి పునఃప్రారంభం అవ్వాలంటే బిఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్ ని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, క్లస్టర్ ఇంచార్జ్ లు, బూత్ ఇంచార్జ్ లు తదితరులు పాల్గొన్నారు.

## రైతు కుటుంబానికి పరామర్శ

*** రూ.1లక్ష ఆర్థికసాయం ప్రకటించిన ప్రకటించిన చలమల్ల**



చౌటుప్పల్, ప్రజాస్పూర్తి: చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామానికి పత్తి రైతు ఇటికాల ఉపేందర్ రెడ్డి అప్పుల బాధతో ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు చలమల్ల కృష్ణారెడ్డి ఉపేందర్ కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. రైతు కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. రూ.1లక్ష ఆర్థికసాయం ప్రకటించారు. ఉపేందర్ రెడ్డి పిల్లల చదువులకు సైతం అండగా ఉంటానని హామీ ఇచ్చారు.



## ఘనంగా హజరత్ జిందాషా మదార్ ఉర్సు ఉత్సవాలు

జగద్గిరిగుట్ట, (ప్రజాస్పూర్తి):కుత్బుల్లాపూర్ నియోజక వర్గం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గాంధీ నగర్ లో గల హజరత్ జిందాషా మదార్ (రెహమతుల్లా ఆలే ) ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దర్గా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సందలే షరీఫ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కె.యం. ప్రతాప్ హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేసి సందల్ ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ హజరత్ జిందాషా మదార్ (రెహమతుల్లా ఆలే) ప్రజలందరిని చల్లగా చూడాలని వేడుకున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఎండి.సిరాజ్, ఎండి రియాజ్, షైక్ బాబు మియా,ఎండీ రషీద్,షైక్ గౌస్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏటిపి ఆవిర్భవ దినోత్సవ వేడుకలు



ప్రజా స్పూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కొర్సా చిట్టిబాబు ఆధ్వర్యంలో ఏటీఏ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కొమరం భీమ్ భవనం కేంద్రంగా ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఏటిఏ జిల్లా ప్రధాన కార్యదర్శి నానమాద్రి సత్యనారాయణ పాల్గొని ఏటిఏ జెండాను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ స్థాపించి 13 వసంతాలు పూర్తయ్యాయన్నారు. ఆదివాసి ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే ఏకైక మార్గంగా పోరాడుతూ అనేక సమస్యలకు పరిష్కారం చూపుతుందని, ఏజెన్సీ ప్రాంతంలో వంద శాతం పదోన్నతులు పోరాడి సాధించుకున ఏకైక సంఘం ఏటీఏ మాత్రమేనని ఉద్ఘాటించారు. ఇప్పటికే మంత్రులకి, గిరిజన ఎమ్మెల్యేలపై ఒత్తిడి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏటిఏ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సవలం వీరాస్వామి, మండల అధ్యక్షులు సిద్ధబోయిన వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పడిగా మురళి, గట్టుపల్లి శేషగిరిరావు, జవాజి రాంప్రసాద్, రఘు, విశాల రాధా, కోడిపై వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు

# నేడు కన్ సాన్ పల్లి లో మృత్యుంజయ హోమం

**- అధిక సంఖ్యలో పాల్గొననున్న ప్రజలు**

అందోలు, ప్రజాస్పూర్తి : అందోలు మండల పరిధిలోని కన్ సాన్ పల్లి గ్రామంలో ని రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం మృత్యుంజయ హోమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రామ పురోహితులు ఆనంద్ శర్మ, వేద పండితుల మంత్రోచ్చరణాల మధ్య ఈ హోమం జరగనుంది. మహా మృత్యుంజయ హోమం అనేది అకాల మరణాన్ని నివారించడానికి మరియు మృత్యువుపై విజయం సాధించడానికి శివుడిని ఆరాధించే ఒక పూజ అని ఈ హోమం వల్ల జీవితంలోని ప్రతికూల ప్రభావాలు తొలగిపోతాయని, ఆరోగ్య సమస్యలు తగ్గుతాయని నమ్మడంతో పాటు జాతకంలో దోషాలు ఉన్నవారు లేదా ఆరోగ్యంతో బాధపడేవారు దీనిని చేయిస్తారని వేద పండితులు చెబుతున్నారు.



## చిన్నారుల 'ఊపిరి' ఉక్కిరిబిక్కిరి! దిల్లీలో నిరసనలు

దేశ రాజధానిలో కాలుష్య తీవ్రతతో గాలి నాణ్యత రోజు రోజుకూ క్షీణిస్తోంది. ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తూ దిల్లీ వాసులు ఆందోళనకు దిగారు. వివిధ వర్గాల ప్రజలు, తల్లిదండ్రులు, పర్యావరణ కార్యకర్తలు ఇండియా గేట్ వద్ద భారీ నిరసన చేపట్టారు. చిన్నారులతో కలిసి అనేక మంది మహిళలు హాజరై.. ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. '' ప్రజా ప్రతినిధులతో సమావేశం కావాలని కోరుతున్నాం. ముఖ్యమంత్రి అపాయింట్ మెంట్ కోరినప్పటికీ నిరాకరించారు. కాలుష్య తీవ్రత వల్ల చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందుకే తల్లిదండ్రులు భారీ స్థాయిలో వీధుల్లోకి వచ్చి నిరసన చేపట్టారు'' అని పర్యావరణవేత్త భావ్రీన్ ఖండారీ పేర్కొన్నారు. ప్రతి ముగ్గురు చిన్నారుల్లో ఒకరి ఊపిరితిత్తులు దెబ్బతింటున్నాయని, స్వచ్ఛమైన గాలిలో పెరిగే పిల్లలతో పోలిస్తే వీరి జీవితకాలం దాదాపు 10 సంవత్సరాలు తక్కువగా ఉంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వచ్ఛమైన గాలిని అందించడంలో ప్రభుత్వం విఫలమైందని మరో నిరసనకారుడు ఆరోపించారు. మాజీ సీఎం షీలా దీక్షిత్ హయాంలో దిల్లీ 'గ్రీన్ క్యాపిటల్'గా ఉండేదని, ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరాల్లో చేరిందన్నారు. రాజకీయ నాయకులు మాత్రం బాధ్యత వహించకుండా ఒకరిపై ఒకరు నిందలు వేసుకుంటున్నారని దుయ్యబట్టారు. ఈ క్రమంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇండియా గేట్ వద్ద నిరసనలకు దిగారని పేర్కొంటూ పలువురు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## ఓట్ల చోరీని అడ్డుకుంటే.. బిహార్‌లో మాదే అధికారం: రాహుల్ గాంధీ

భాజపా, ఆరెస్సెస్‌లు దేశాన్ని విభజించేందుకు యత్నిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. 'ఇండియా' కూటమి మాత్రం దేశాన్ని ఐక్యంగా ఉంచేందుకు కృషి చేస్తోందన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం చివరి రోజు కిషన్‌గంజ్‌లో నిర్వహించిన సభలో ఈమేరకు ప్రసంగించారు. రాష్ట్రంలో ఓట్ల చోరీని అడ్డుకుంటే.. 100 శాతం 'ఇండియా' కూటమిదే అధికారమని పేర్కొన్నారు. ''కర్ణాటక, మహారాష్ట్ర, హరియాణాల్లో ఓట్ల చోరీపై ఆధారాలు చూపించాం. కానీ.. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌లు సమాధానం ఇవ్వలేక పోయారు. ఎందుకంటే.. వాస్తవాలన్నీ ఇప్పుడు ప్రజల ముందుకు వచ్చాయి. మోదీ, అమిత్ షాలు దేశంలో ఎక్కడికెళ్లినా.. చివరకు 'ఓట్ల చోరీ' విషయంలో దొరికిపోతారు'' అని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. ఓట్ల చోరీని అడ్డుకుంటే బిహార్‌లో 'ఇండియా' కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందన్నారు. దీని కోసం యువత, రైతులు, కార్మికులంతా కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ''దేశంలో ప్రధాని మోదీ, బిహార్‌లో సీఎం నీతీశ్ కుమార్ ఉపాధిని నాశనం చేశారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కోరుకోవడం లేదు. స్థానికంగా అనేక పంటలు పండుతాయి. కానీ, 20 ఏళ్లలో ఒక్క ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేయలేదు. ఎప్పుడైనా ప్రజలతో మాట్లాడితేనే కదా.. వారి అవసరాలు తెలుసుకునేది'' అని



విమర్శించారు. తమ ప్రభుత్వం ఏర్పడితే రాష్ట్రంలో విద్యారంగాన్ని మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు.

## మరణానంతరం శరీరంలో రక్తప్రసరణ.. వైద్య చరిత్రలో మొదటిసారి

దిల్లీ వైద్యులు వైద్య చరిత్రలో మరో కొత్త అధ్యాయానికి నాంది పలికారు. ద్వారకలోని మణిపాల్ ఆస్పత్రి వైద్యులు మరణించిన మహిళ శరీరంలో ఆగిపోయిన రక్తప్రసరణను తిరిగి ప్రారంభించారు. మరణించిన ఆమె అవయవాలను దానం చేసేందుకు వీలుగా ఈ ప్రక్రియను చేపట్టినట్లు వారు వెల్లడించారు. ఆసియాలోనే ఈ ఘనతను సాధించిన మొదటి ఆస్పత్రి తమదేనని ఛైర్మన్ డాక్టర్ శ్రీకాంత్ శ్రీనివాసన్ పేర్కొన్నారు. మోటార్ న్యూరాన్ వ్యాధి కారణంగా పక్షవాతం బారిన పడిన గీతా చావ్లా (55) అనే మహిళ శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతుండగా కుటుంబసభ్యులు నవంబర్ 5న అమెను మణిపాల్ ఆస్పత్రికి తీసుకువచ్చారు.



పరిస్థితి మరింత దిగజారడంతో నవంబర్ 6న మరణించింది. అయితే ఆమె అవయవాలు దానం చేయాలనుకుంటున్నట్లు మృతురాలి కుటుంబం తెలియజేయడంతో అక్కడి వైద్యబృందం నార్మోథెర్మిక్ రీజినల్ పెర్ఫ్యూజన్ అనే అరుదైన ప్రక్రియను నిర్వహించింది. ఎక్స్‌ట్రాకార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజనేటర్ ను ఉపయోగించి వైద్యులు మృతురాలి ఉదర అవయవాలలో రక్త ప్రసరణను విజయవంతంగా పునఃప్రారంభించారు. అనంతరం అవయవాలు సేకరించారు.ఎన్ఆర్పీని ఉపయోగించి కాలేయం, మూత్రపిండాలను సురక్షితంగా తీసి ఇతరులకు విజయవంతంగా అమర్చినట్లు వైద్యులు పేర్కొన్నారు. బ్రెయిన్ డెడ్ అయిన వారి నుంచే కాకుండా ఇకపై సహజ మరణాల తర్వాత కూడా మృతుల నుంచి అవయవాలు సేకరించడం సాధ్యమేనని నిరూపించామన్నారు.

## బిహార్‌లో మరోసారి ఎన్డీయేదే అధికారం: మంత్రి లోకేశ్

పట్నా: బిహార్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు వెళ్లిన ఏపీ మంత్రి నారా లోకేశ్ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో పట్నాలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. బిహార్‌లో భాజపా ఎన్నికల ప్రచార సమన్వయకర్తగా ధర్మేంద్ర ప్రధాన్ వ్యవహరిస్తున్నారు. కూటమి విజయం కోసం ఆయన శ్రమిస్తున్నారని, గతేడాది హరియాణా, ఒడిశా ఎన్నికల్లో భాజపా విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించారని ఈ సందర్భంగా లోకేశ్ మీడియాతో అన్నారు. బిహార్‌లో మరోసారి ఎన్డీయే సర్కారును గెలిపించేందుకు ధర్మేంద్ర ప్రధాన్ చేస్తున్న కృషిని మంత్రి లోకేశ్ అభినందించారు. రాష్ట్రంలో మరోసారి ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటు చేయగలదన్న నమ్మకం తనకుందని పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ వెంట ఎంపీలు సానా సతీష్, గంటి హరీష్, కలిశెట్టి అప్పలనాయుడు ఉన్నారు.

## మరి గతంలో ఆరెస్సెస్‌ను ఎలా నిషేధించారు..?

**: విపక్షాలను ప్రశ్నించిన మోహన్ భాగవత్**

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌ను బ్యాన్ చేయాలని ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్‌పై ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ స్పందించారు. ఆరెస్సెస్ సంస్థను ఇప్పటి వరకు అధికారికంగా ఎందుకు రిజిస్టర్ చేయలేదని ప్రతిపక్షాలు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ..హిందూ ధర్మం కూడా ఎక్కడా నమోదు చేసుకో లేదని.. అదే విధంగా తాము కూడా ప్రత్యేకంగా రిజిస్టర్ చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు ఆరెస్సెస్‌ను గుర్తింపు లేని సంస్థగా పేర్కొంటున్నాయని.. అలాంటప్పుడు గుర్తింపే లేని సంస్థను గతంలో మూడు సార్లు ఎలా బ్యాన్ చేశారని ప్రశ్నించారు. తమ సంస్థ గుర్తింపు పొందిందనడానికి ఇంతకన్నా ఆధారాలు ఏముంటాయని మోహన్ భాగవత్ నిలదీశారు. 1925లో ఆరెస్సెస్‌ను స్థాపించినట్లుగా నాటి బ్రిటిష్ ప్రభుత్వంతో అధికారికంగా నమోదు చేయించాలా అని ప్రశ్నించారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఆరెస్సెస్‌ను అధికారికంగా నమోదు చేసుకోవడాన్ని భారత ప్రభుత్వం తప్పనిసరి చేయలేదన్నారు. ఆదాయపు పన్ను శాఖ, కోర్టులు ఆరెస్సెస్‌ను వ్యక్తుల సంఘంగా గుర్తించాయని.. దానిలో భాగంగానే దానిని పన్నుల నుంచి మినహాయించాయన్నారు. కర్ణాటకలో ఆరెస్సెస్ కార్యకలాపాలను నిషేధించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకుడు ప్రియాంక్ ఖర్గే రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు లేఖ రాశారు. అందులో ఆయన ఆరెస్సెస్‌ను గుర్తింపు లేని సంస్థగా పేర్కొన్నారు. ప్రభుత్వ మైదానాలు, ఉద్యానవనాలు, పాఠశాలల ఆవరణలు, క్రీడా మందిరాలు తదితరాల్లో ఆరెస్సెస్ కార్యకలాపాలను బ్యాన్ చేయాలని కోరారు.

# గచ్చిబౌలిలో 'అమృత సీనియర్ లివింగ్'ను ప్రారంభించిన నారా భువనేశ్వరి

హైదరాబాద్: నగరంలోని గచ్చిబౌలిలో 'అమృత సీనియర్ లివింగ్' పేరుతో ఏర్పాటు చేసిన అడ్వాన్స్డ్ రిహాబిలిటేషన్ కేంద్రాన్ని ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని శేష్ కొండపల్లి ఏర్పాటు చేశారు. శస్త్ర చికిత్స అనంతరం వృద్ధులకు అవసరమైన సేవలను దీని ద్వారా అందించనున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ మురళీమోహన్, నందమూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.







## యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న 78,200 మంది భక్తులు

యాదగిరిగుట్ట: కార్తికమాసం సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఇవాళ ఒక్కరోజే 78,200 మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్టు అధికారులు తెలిపారు. దీంతో రికార్డు స్థాయిలో.. దేవస్థానంలోని వివిధ విభాగాల ద్వారా రూ.1.57 కోట్ల ఆదాయం సమకూరింది. రద్దీకి అనుగుణంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో తెలిపారు.

## డబ్బులు ఊరికే రావు..

### పెట్టుబడులు పెట్టే ముందు జాగ్రత్త: సీపీ సజ్జనార్



హైదరాబాద్: రోజూ రూ.కోట్ల విలువైన సైబర్ నేరాలు జరుగుతున్నాయని హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్ అన్నారు. సిటీ పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్ నియంత్రణపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెట్టుబడుల పేరుతో చాలా యాప్‌ల్లో బాధితులు మోసపోతున్నారని పేర్కొన్నారు. డబ్బులు ఊరికే రావని.. పెట్టుబడులు పెట్టే ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏపీకే ఫైల్స్ వల్ల కూడా మోసాలు జరుగుతున్నాయని వివరించారు. సైబర్ నేరాల్లో డబ్బు నష్టపోయిన వెంటనే బాధితులు 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక...

### అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్: ఆర్వీ కర్ణన్

హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ తెలిపారు. నేటితో ఎన్నికల ప్రచార గడువు ముగిసిన నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎన్నికల బరిలో మొత్తం 58 మంది అభ్యర్థులు ఉన్నట్లు తెలిపారు. ''మొత్తం 4 బ్యాలెట్ యూనిట్లు ఉంటాయి. సోమవారం కోట్ల విజయ్‌భాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఎన్నికల సామగ్రి పంపిణీ చేస్తాం. నియోజకవర్గంలో మొత్తం 407 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. అన్ని పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ ఉంటుంది. ఈ సారి కొత్తగా డ్రోన్ల ద్వారా నిఘా ఉంటుంది'' అని ఆర్వీ కర్ణన్ తెలిపారు.



## మానవత్వం చాటుకున్న అధికారులు..

### విరాళాలతో వృద్ధుడి అంత్యక్రియలు

పర్చూరు: భార్య మృతి చెంది మూడు నెలలైంది. అనారోగ్యంతో భర్త ఆస్పత్రిలో చేరాడు. అండగా ఉంటాడనుకున్న కుమారుడు మద్యానికి బానిసయ్యాడు. తండ్రి మరణించాడని తెలిసి కూడా అతని కుమారుడు కన్నెత్తి చూడలేదు. దీంతో అధికారులు స్పందించి.. మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. బాపట్ల జిల్లా పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన చీరాల శ్రీనివాసరావు (60), అన్నపూర్ణ భార్యాభర్తలు. వీరి కుమారుడు సురేశ్ మద్యానికి బానిసయ్యాడు. మూడు నెలల క్రితం అన్నపూర్ణ మరణించారు. సురేశ్‌కు గతంలో వివాహం కాగా.. భార్యాభర్తలు దూరంగా ఉంటున్నారు. ఈ నెల 6న తండ్రి శ్రీనివాసరావు అనారోగ్యానికి గురికావడంతో.. సురేశ్ పర్చూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేర్చి వెళ్లిపోయాడు. చికిత్స పొందుతూ అతడు ఈ నెల 7న మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఎవరూ రాకపోవడంతో ఆసుపత్రి అధికారులు పర్చూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై జీవీ చౌదరి నూతలపాడులో విచారించగా.. సురేశ్ మద్యానికి బానిసయ్యాడని, బంధువులు చీరాలలోని హస్తినాపురంలో ఉంటారని తెలిసింది. దీంతో బంధువులకు సమాచారం ఇచ్చి.. సురేశ్ కోసం పోలీసులు గాలించారు. ఆదివారం సురేశ్‌ను గుర్తించి.. బంధువుల ఆధ్వర్యంలో మృతదేహం అప్పగించారు. దహన సంస్కారాలకు తన వద్ద డబ్బుల్లేవని సురేశ్ చెప్పడంతో.. తమవంతుగా పోలీసులు, పంచాయతీ అధికారులు ఆర్థిక సాయం చేశారు. అనంతరం పర్చూరు హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

# ఇన్నాళ్లూ సీఎం రేసులో ఒక్కరే.. ఇప్పుడు ఇద్దరు

**: మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి**



హైదరాబాద్: దగ్గరివాళ్లు చెప్పినా వినే పరిస్థితిలో సీఎం రేవంత్‌రెడ్డి లేరని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. ప్రశ్నిస్తే పాలన మీరే చేయండంటూ ఎదురుదాడికి దిగుతున్నారని, అలాంటప్పుడు అధికారం నుంచి దిగిపోవాలని అన్నారు. రేవంత్ రెడ్డి కంటే ఎవరైనా బాగానే పాలన చేస్తారని ఎద్దేవా చేశారు. రెండేళ్లలో నిర్మాణ రంగాన్ని ఖతం చేశారని విమర్శించారు. బయటివాళ్లకు అధికారం ఇవ్వాల్సిన అవసరం లేదని, పార్టీలో ఉన్న వ్యక్తులకే ఇవ్వొచ్చని వ్యాఖ్యానించారు. నిన్నటిదాకా భట్టి విక్రమార్క మాత్రమే సీఎం రేసులో ఉండేవారని, ఇప్పుడు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కూడా పోటీలో ఉన్నారని అన్నారు. ఆదివారం జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ''సర్పంచ్ ఎన్నికలకు తిరిగినట్లు రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ సందుసందుకు తిరిగారు. ప్రెస్‌క్లబ్ పబ్‌లా కనిపిస్తోందని.. స్టార్ హోటల్‌లో మీట్ ది ప్రెస్ పెట్టారు. రూ.3 వేల కోట్లతో ఉస్మానియా, 100 ఎకరాల్లో హైకోర్టు నిర్మాణం, ఆర్టీసీకి రూ.7వేల కోట్ల లాభం తెచ్చినట్లు చెప్పుకొన్నారు. 20వేల నోటిఫికేషన్లు ఇచ్చి 60 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. అసలు ఒక్క నోటిఫికేషన్ అయినా వచ్చిందా? నిరుద్యోగులు జూబ్లీహిల్స్‌లో నామినేషన్ వేసి కాంగ్రెస్‌ను ఓడించాలని తిరుగుతున్నారు. పీజేఆర్‌ను చంపిందే కాంగ్రెస్ పార్టీ. రాజకీయాల్లో ఆయన కుటుంబానికి స్థానం లేకుండా చేసింది రేవంత్ రెడ్డి. 2004 నుంచి 2014 వరకు స్వర్ణయుగం అన్నారు. మీ జిల్లాలో కూడా ఆకలిచావులు ఉన్నాయి కదా'' అని జగదీశ్‌రెడ్డి అన్నారు.

## ఊడిన స్టీరింగ్ రాడ్..

## తాండూరు డిపో ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం




యాలాల: తాండూరు డిపో ఆర్టీసీ బస్సుకు ప్రమాదం తప్పింది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా యాలాల మండలంలోని లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ అద్దె బస్సు మహబూబ్‌నగర్ వెళ్తుండగా.. లక్ష్మీనారాయణపూర్ చౌరస్తా సమీపంలోకి రాగానే స్టీరింగ్ రాడ్ బోల్టు ఊడిపోయింది. దీంతో బస్సు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. జాతీయ రహదారిపై బస్సు వేగంగా వెళ్తున్న సమయంలో ఈ ఘటన జరిగి ఉంటే.. తమ పరిస్థితి ఏంటని పలువురు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. బస్సు స్టీరింగ్ రాడ్ బోల్ట్ ఊడిపోయిన మాట వాస్తవమేనని, ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగలేదన్నారు. ఎవరికీ ఇబ్బంది లేకుండా మరొక బస్సులో వారి గమ్యస్థానాలకు పంపామని డిపో మేనేజర్ తెలిపారు. ఇటీవలే చేవెళ్ల వద్ద ఆర్టీసీ బస్సు ఘోర ప్రమాదానికి గురై 19 మంది మృతి చెందిన విషయం తెలిసిందే.

## జూబ్లీహిల్స్‌లో డిప్యూటీ CM భట్టి సుడిగాలి పర్యటన



జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారం చివరి రోజు ఆదివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సుడిగాలి పర్యటన చేశారు. ఎర్రగడ్డ డివిజన్ లోని మోతీ నగర్ లో మంత్రి జూపల్లి తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం స్థానిక డివిజన్లో పరిస్థితిని మంత్రి జూపల్లి తో ప్రత్యేకంగా భేటీ అయి సమన్వయం చేశారు. ఆ తర్వాత యూసఫ్ గూడ డివిజన్ కు చేరుకొని మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి ప్రచారం నిర్వహించారు, అనంతరం స్థానిక నేతలతో మంత్రి పొన్నంతో కలిసి భేటీ అయి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం వెంగళరావు డివిజన్ లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరితో భేటీ అయ్యారు. ఆ తర్వాత రహమత్ నగర్ డివిజన్లో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో, బోరబండ డివిజన్ లో మంత్రి సీతక్కతో సమీక్ష నిర్వహించారు. యూసఫ్ గూడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉన్న మంత్రులు అందరితో, పార్టీ నేతలతో ప్రత్యేకంగా సమావేశమై పరిస్థితిని సమీక్షించి, పకడ్బందీగా పోలింగ్ చేయించుకొని పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు అవసరమైన చర్యలకు సంబంధించి యూసుఫ్ గూడా కార్యాలయంలో సుదీర్ఘంగా చర్చించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అవుతుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి మోతినగర్ వీధుల్లో తిరుగుతూ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు ఆయన వివరించారు. ప్రజలతో మాట్లాడుతూ మీరు వేసే ఓటుతోనే ఈ ప్రాంత అభివృద్ధి సాధ్యం అవుతుందని ఆయన చెప్పారు. మా దృష్టికి వచ్చిన సమస్యలకు పరిష్కారం చూపిస్తామన్నారు. తాము వేసే ప్రతి అడుగు భావితరాల భవిష్యత్తు, రాష్ట్రాభివృద్ధి కోసమేనని భట్టి విక్రమార్క చెప్పారు. అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్ తోనే సాధ్యమవుతుందని భట్టి విక్రమార్క అన్నారు. ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటూ... స్థానిక సమస్యలపై అవగాహన ఉన్న నవీన్ యాదవ్ ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.

## త్వరలో 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రం



త్వరలో సింగరేణి 800 మెగావాట్ల అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రం భూమి పూజ చేయనున్న నేపథ్యంలో ఆదివారం సంస్థ సీఎండీ బలరాం సన్నాహక పనులను సమీక్షించారు. మంచిర్యాల జిల్లా జైపూర్ వద్ద ఉన్న సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం సమీపంలోనే నిర్మించబోయే అల్ట్రా సూపర్ క్రిటికల్ థర్మల్ పవర్ ప్లాంట్ శంకుస్థాపన త్వరలో ఉంటుందని కాబట్టి ఇందుకు సంబంధించిన పనులు వేగవంతంగా చేపట్టాలని ఎస్.టి.పి.పి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జనరల్ మేనేజర్లను ఆయన ఆదేశించారు. అదే ప్రాంగణంలో ప్రయోగాత్మకంగా ఏర్పాటు చేసిన మిథనాల్ ప్లాంట్ ట్రయల్ రన్ పనితీరును స్వయంగా పరిశీలించారు. రామగుండం 1 లో బేస్ వర్క్ షాప్ ప్రారంభించి... గోదావరిఖనిలో సిఎస్ఆర్ పనులను పరిశీలించారు. శ్రీరాంపూర్ లో ఐ కె ఓసి గని తనిఖీ చేపట్టారు. నీటి బిందువు జల సింధువు చెరువుల సందర్శించారు. భూగర్భ జలాల పెంపుదల కోసం ఉద్దేశించి ఏర్పాటుచేసిన చెరువుల్లో నీరు చేరి ఉండటం పై ఆయన తన సంతృప్తిని వ్యక్తం చేశారు. రామగుండం 1 ఏరియాలో జీడికే 5 ఓపెన్ కాస్ట్ గనిని సందర్శించి ఉత్పత్తిని సమీక్షించారు. ఓబీ డంపులపై నాటిన మొక్కలను పరిశీలించి సీఎండీ కూడా కొన్ని మొక్కలు నాటారు. ఈ ఓపెన్ కాస్ట్ గని కోసం నిర్మించిన బేస్ వర్క్ షాప్ ను ఆయన ప్రారంభించారు. తర్వాత శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకె ఓపెన్ కాస్ట్ గనిని సందర్శించారు. ఉత్పత్తి ప్రక్రియ రవాణా తదితర అంశాలను సమీక్షించారు. లక్ష్యాలను సాధించాలని నిర్దేశించారు. గనికి పక్కన నిర్మించిన మినీ పార్కును సందర్శించారు. ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ శ్రీనివాస్ ఇంకా ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీఎండీ వెంట డైరెక్టర్ ఈ అండ్ ఎం ఎం తిరుమలరావు ఎస్ టి పి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్ చిరంజీవి జనరల్ మేనేజర్లు నరసింహారావు, మదన్ మోహన్ ఉన్నారు.

# ఏపీలో జరిగిన దాన్ని దృష్టిలో ఉంచుకుని బిహార్ యువత మేల్కోవాలి

**: మంత్రి నారా లోకేశ్**



పట్నా: బిహార్ అభివృద్ధి కోసం మరోసారి ఎన్డీయే కూటమిని గెలిపించాలని ఏపీ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బిహార్ వెళ్లిన ఆయన.. పట్నాలో మీడియా సమావేశం నిర్వహించారు. "బిహార్‌లో డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. నీతీశ్ సర్కార్‌కు ముందు బిహార్‌లో జంగిల్‌రాజ్ ఉండేది. ప్రస్తుతం అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. పట్నాలో పారిశ్రామికవేత్తలతోనూ మాట్లాడాను. ఇక్కడి అభివృద్ధి పనులు, ప్రభుత్వ విధానంపై సంతోషం వ్యక్తం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో అత్యధికంగా బిహార్‌కు నిధులు కేటాయించారు. బిహార్ తర్వాత ఏపీకి బడ్జెట్‌లో అధిక నిధులు ఇచ్చారు. రెండు రాష్ట్రాల్లో ఎన్డీయే కూటమి అధికారంలో ఉండటమే ఇందుకు కారణం. పరిశ్రమల రాకతో పాటు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయి. అభివృద్ధి పనులు జరుగుతున్న సమయంలో ప్రభుత్వం మార్చడం సరికాదు. ప్రభుత్వం మారితే నష్టం జరుగుతుంది. గతంలో ఏపీలో ఒక్క ఛాన్స్ పేరుతో ఓ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత పరిశ్రమలన్నీ పారిపోయాయి. ఏపీలో జరిగిన దాన్ని దృష్టిలో ఉంచుకుని బిహార్ యువత మేల్కోవాలి. వికాస్ భారత్ సాధించాలంటే బిహార్ అభివృద్ధి ముఖ్యం. ఇక్కడి యువత, ఓటర్లు మరోసారి ఎన్డీయేను గెలిపించాలి" అని లోకేశ్ పిలుపునిచ్చారు.

## రామచంద్రాపురంలో బాలిక మృతి ఘటన.. వీడిన మిస్టరీ!



రామచంద్రాపురం: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రామచంద్రాపురంలో బాలిక మృతి ఘటనలో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ నెల 4న ఫ్యాన్‌కు వేలాడుతూ బాలిక మృతదేహం కనిపించింది. ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రచారం జరిగింది. బాలికను హత్య చేశారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. మిస్టరీగా మారిన ఈ కేసును పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ రాహుల్ మీనా మీడియాకు వెల్లడించారు. "బాలిక హత్యకు సంబంధించి కేసు నమోదు చేశాం. నిందితుడు శ్రీనివాస్‌ను అరెస్టు చేశాం. బాలిక ఉండే భవనంలోనే జిరాక్స్ షాపులో అతడు పనిచేసేవాడు. ఆర్థిక సమస్యలతో నిందితుడు తీవ్ర ఒత్తిడిలో ఉన్నాడు. అతడి చెల్లి పెళ్లికి సంబంధించి ఆర్థిక సమస్యలు ఉన్నాయి. నాలుగో తేదీ సాయంత్రం 4.30 గంటలకు బాలిక స్కూల్ నుంచి ఇంటికి వచ్చింది. సాయంత్రం 5 గంటలకు బాలిక ఇంటికి శ్రీనివాస్ వెళ్లాడు. ఆమె తల్లి లేదని గ్రహించి చోరీ చేయాలనుకున్నాడు. గతంలోనూ బాలిక ఇంటికి ఇతర పనులకు సంబంధించి వెళ్లేవాడు. అక్కడి బెడ్‌రూమ్‌లో విలువైన వస్తువులు ఉన్నాయి. ఈక్రమంలో ఇంట్లోకి ఎందుకు వచ్చావని బాలిక నిందితుడిని ప్రశ్నించింది. తన తల్లికి విషయం చెప్పాలని ప్రయత్నించింది. నిందితుడు శ్రీనివాస్‌కు సంబంధించి ప్రింట్ ఘటనాస్థలిలో దొరికింది. బాలికను అతడే హత్య చేసినట్లు నిర్ధరించాం. సీడీఆర్, సీసీటీవీ పరిశీలిస్తే నిందితుడి లోకేషన్ అదే ప్రాంతంలో ఉన్నట్లు తెలిసింది. మిగతా వారిని విచారించి శ్రీనివాస్‌ను పట్టుకున్నాం. ఆధారాల మేరకు అరెస్టు చేశాం. మరో మెడికల్ రిపోర్టు రావాల్సి ఉంది.. సాంకేతిక ఆధారాల కోసం చూస్తున్నాం." అని ఎస్పీ తెలిపారు.

## కుంకీ ఏనుగుల కేంద్రాన్ని ప్రారంభించిన పవన్ కల్యాణ్

**పలమనేరు: చిత్తూరు జిల్లాలో కుంకీ ఏనుగుల కేంద్రాన్ని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రారంభించారు. పలమనేరు మండలం ముసలిమడుగులో 20 ఎకరాల్లో దీన్ని ఏర్పాటు చేశారు. కర్ణాటక నుంచి 4 కుంకీ ఏనుగులను తెచ్చినట్లు పవన్ కల్యాణ్‌కు అధికారులు తెలిపారు. వీటి ద్వారా జనావాసాలు, పొలాల్లోకి వచ్చే అడవి ఏనుగులను ఎలా కట్టడి చేస్తారో వివరించారు. కుంకీ ఏనుగుల విన్యాసాలను పవన్ కల్యాణ్ తిలకించారు. వాటికి ఆహారం తినిపించారు.**







## ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్.. మంత్రి లోకేష్ ఎగ్జిక్యూషన్



రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్‌లపై ప్రశంసల వర్షాన్ని కురిపించారు. వారి ఘనతను కొనియాడుతూ ట్విట్టర్ లో పోస్టు చేశారు. చంద్రబాబు గారి విజన్.. లోకేష్‌గారి ఎగ్జిక్యూషన్. ఇదే గూగుల్ ప్రాజెక్ట్ వెనుక రహస్యం అంటూ కొనియాడారు. మంత్రి లోకేష్ అమెరికా టూర్లో గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలు ప్రారంభమయ్యాయి అన్నారు. వారి ప్రయత్న ఫలితంగా దేశంలోనే అతి పెద్ద ఏఐ డేటా సెంటర్ రూపుదిద్దుకుంటోందని వెల్లడించారు.

**దేశంలోనే తొలి ఏఐ హబ్..**

విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటు కానున్న గూగుల్ డేటా సెంటర్ దేశంలోనే తొలి ఏఐ హబ్. ఇందులో 15 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెట్టనున్నారు. గూగుల్ డేటా సెంటర్ ద్వారా 2లక్షలకు పైగా ఉద్యోగాలు లభించే అవకాశాలున్నాయి. సముద్రగర్భ కేబుల్ వ్యవస్థ ద్వారా అంతర్జాతీయ నెట్వర్కుకు సెంటరును అనుసంధానిస్తారు. తద్వారా నగరానికి అంతర్జాతీయ స్థాయి కనెక్టివిటీ కేంద్రంగా గుర్తింపు రానుంది. ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది మంది టెక్ స్టూడెంట్స్, ఇంజనీర్లు, పరిశోధకులు నేరుగా లాభపడతారని అంచనా.

## ఏపీలో బీసీల పాలిట సువర్ణధ్యాయం 'ఆదరణ' పథకం



గత జగన్‌మోహన్ రెడ్డి పరిపాలనలో తిరుమల శ్రీవారి ఆదాయానికి తీవ్ర నష్టం వాటిల్లిందని శ్రీవారి లడ్డూ ప్రసాదంలో 90% నెయ్యికి బదులు పామాయిల్ కలపడం, ఇతర రసాయనాల కల్తీ జరగడం వంటి ఆరోపణలు వెలుగులోకి వచ్చాయని ఏపీ యాదవ కార్పొరేషన్ చైర్మన్ జి.నరసింహ యాదవ్ విమర్శించారు. దీనిపై సిట్ విచారణ జరుగుతోందని 16వ నిందితుడి అరెస్టు వరకు ఈ కల్తీ వ్యవహారాలు బయటపడుతున్నాయని తెలిపారు. ఆదివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీవారి హుండీ లెక్కించే విషయంలో కూడా టీటీడీ ఉద్యోగి కోట్లాది రూపాయల ఆస్తులు కూడబెట్టారని, ఈ దోపిడీలో నాటి పాలకులు వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రమేయం ఉందని, దీనిపై హైకోర్టు విచారణకు ఆదేశించిందని ప్రస్తావించారు. గతంలో లడ్డూ కల్తీపై తాము వెంకటగిరి సభలో చెప్పినా పట్టించుకోలేదని, కానీ ఇప్పుడు నిజాలు బయటపడుతున్నాయని నరసింహ యాదవ్ ఆరోపించారు. ప్రస్తుత రాజకీయ వాతావరణంలో నీతి వాక్యాలు చెప్పే కరుణాకర్ రెడ్డి గత పాలనలో జరిగిన స్వామివారి దర్శనాల వ్యవహారంపై, లడ్డూ ప్రసాదాల్లో జరిగిన నెయ్యి కల్తీ విషయంలో హుండీ దోపిడీలో భాగస్వామ్యం వహించి ఆస్తులు కూడబెట్టుకుని లోక్ అదాలత్‌లో సెటిల్ చేసుకున్న తీరుపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి లు జగన్మోహన్ రెడ్డికి సమీప బంధువులు కావడం వల్లనే గత ఐదేళ్లపాటు టీటీడీ పాలకవర్గం వారి కనుసన్నల్లోనే నడిచిందని విమర్శించారు. గతంలో ఎన్టీఆర్, నారా చంద్రబాబు నాయుడు హయాంలో ఎప్పుడూ శ్రీవారి ప్రతిష్ఠను దెబ్బతీసే లేదా డబ్బు దోచుకునే ప్రయత్నాలు జరగలేదని అన్నారు. కానీ గత జగన్‌మోహన్ రెడ్డి పాలనలో దర్శనాల పేరిట పుంకాలుగా అమ్ముకొని స్వామివారిని అవమానించారని గతంలో వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ఏడుకొండలను రెండు కొండలు అన్నారని గుర్తు చేస్తూ విమర్శించారు. ప్రస్తుతం చంద్రబాబు నాయుడు సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం టీటీడీ వ్యవహారాల్లో భక్తులు మెచ్చే విధంగా పరిపాలన సాగిస్తోందని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చుకుంటూ ముందుకు సాగుతోందని ముఖ్యంగా వెనుకబడిన వర్గాల సంక్షేమంపై దృష్టి సారించిందని వివరించారు. కనకదాసు జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటించడం నారా లోకేష్ పాదయాత్రలో ఇచ్చిన లక్షల ఉద్యోగాల హామీ నెరవేరేలా పరిశ్రమల వెల్లువ రాష్ట్రంలో రావడం విశాఖలో జరగనున్న సీఐఏ సదస్సు దీనికి నిదర్శనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాల అమలులో బీసీలకు పెద్దపీట వేయడం వంటివి ప్రస్తావించారు. ఎన్టీఆర్ పార్టీ ఆవిర్భావం నుంచే బీసీలకు శాసనసభ, పార్లమెంట్‌లో అవకాశాలు కల్పించిన చరిత్ర తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు బీసీ సంక్షేమ మంత్రి సవితమ్మ ఆధ్వర్యంలో విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్‌లో మూడు రోజుల పాటు అన్ని కార్పొరేషన్ల చైర్మన్లతో సమావేశం జరిగిందన్నారు. గత జగన్ పాలనలో కుప్పకూలిన వ్యవస్థలను సరిచేయడం రాబోయే రోజుల్లో బీసీలకు ముఖ్యంగా కులవృత్తులు, చేతివృత్తుల వారికి 'ఆదరణ' పథకం ద్వారా గతంలోవలే అండగా నిలవడానికి సమగ్రంగా చర్చలు జరిగాయని, రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో బీసీల పాలిట సువర్ణధ్యాయం రాబోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## 'బిహార్ మోడల్‌ను అనుసరించండి' బెంగాల్ BLOలకు ఈసీ హెచ్చరిక




పశ్చిమ బెంగాల్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్‌ఐఆర్)లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బూత్ లెవల్ అధికారులకు భారత ఎన్నికల సంఘం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ప్రకటించింది. ఇంటింటికీ వెళ్లి ఫార్మ్స్ పంపిణీ చేయాల్సి ఉండగా.. టీ స్టాళ్లు, లోకల్ క్లబ్బులు, ఇతర ప్రదేశాల నుంచి ఫార్మ్స్ ఇవ్వడంతో ఎనిమిది మంది బీఎల్‌ఓలకు నోటీసులు జారీ చేసింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల కార్యాలయం అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈసీ అన్ని జిల్లా ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్లుకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. బీఎల్‌ఓలు ప్రతి ఓటర్ ఇంటికి వెళ్లి ఫారాలు పంపిణీ చేసి, తిరిగి సేకరించాలనే నియమాన్ని కచ్చితంగా పాటించాలని సూచించింది. బిహార్ మోడల్‌ను అనుసరించాలని ఈసీ రాష్ట్ర అధికారులకు ఆదేశించింది. ఆ మోడల్ ప్రకారం బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఫారాలను పంపిణీ చేసి సేకరించాలి. అధికారులు తమ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పనిసరి అని ఈసీ తెలిపింది. ప్రత్యేక సవరణపై పర్యవేక్షణను బలోపేతం చేయడానికి ప్రతి జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, అలాగే ప్రతి 10 బూత్‌లకు ఒక బీఎల్‌ఓ సూపర్వైజర్‌ను నియమించాలని ఈసీ ఆదేశించింది. అదనంగా, ఓటర్ల ఫిర్యాదులను స్వీకరించేందుకు హెల్ప్‌లైన్ నంబర్‌ను కూడా ప్రారంభించింది.

## రూ.10 లక్షల ఆర్థిక సాయం

పవిత్ర కార్తీక మాసంలో నిర్వహించే వన సమారాధనల్లో పాల్గొనడం అత్యంత సంతోషకరంగా ఉందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నంలో నిర్వహించిన పలు వన సమారాధనల్లో పాల్గొన్నారు. కొండపల్లి ఎస్టేట్ లో నిర్వహించిన కాపు సామాజిక వర్గీయుల ఆత్మీయ వేడుకలో పాల్గొన్నారు. నియోజకవర్గంలో కాపు కల్యాణ మండపం నిర్మాణానికి తన వంతుగా రూ.10 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. టీటీడీ కల్యాణ మండపంలో యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన సమారాధన వేడుకల్లో కొలుసు పార్థసారధితో కలిసి పాల్గొన్నారు. గోకవరంలో ఆర్యవైశ్య వర్గీయుల వన సమారాధనల్లో పాల్గొన్నారు. వన సమారాధనల నిర్వహణతో సామాజిక సమస్యలపై చర్చ అభినందనీయం అన్నారు. 'మానవ సంబంధాలు బలోపేతం కావడానికి ఇలాంటి వన సమారాధనలు కీలకంగా నిలుస్తాయి. నియోజకవర్గంలోని ప్రతి వర్గానికీ అండగా నిలుస్తాను. త్వరలోనే బందరు పోర్టును పూర్తి చేసుకుంటాం. స్థానికంగా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం. అదే సమయంలో యువతకు స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాలు కూడా ఏర్పాటు చేసి యువత భవితకు బాటలు వేయబోతున్నాం." అని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.



## ట్యాంక్ బండ్ బుద్ధ విగ్రహాన్ని సందర్శించిన థాయిలాండ్ బౌద్ధ భిక్షువులు

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన బుద్ధ వనాన్ని థాయిలాండ్ బౌద్ధ భిక్షువులు సందర్శించారు. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా లోని సిద్ధార్థ బుద్ధ విహార నుండి బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య సూచన మేరకు హుస్సేన్ సాగర్ బుద్ధ విగ్రహాన్ని సందర్శించారు. గగన్ మాలిక్ ఫౌండేషన్, గుల్బర్గా సిద్ధార్థ బౌద్ధ విహార సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ శాంతి ధర్మ యాత్ర కోసం ఈ బృందం తెలంగాణకు వచ్చారు. వీరికి బుద్ధవనం ఆర్ట్స్ అండ్ ప్రమోషన్ మేనేజర్ శ్యాంసుందర్రావు వీరికి ఇక్కడి బౌద్ధ వారసత్వ విశేషాలను, తెలియజేశారు. బౌద్ధ భిక్షువులు హుస్సేన్ సాగర్ బుద్ధ విగ్రహం వద్ద పుష్పాంజలి ఘటించి బుద్ధ వందనం సమర్పించారు. అనంతరం పబ్లిక్ గార్డెన్ స్టేట్ మ్యూజియం లో బౌద్ధదాతువులను, వీక్షించారు. రాష్ట్ర రాజధాని నడిబొడ్డున ప్రశాంత వాతావరణంలో, చారిత్రక హుస్సేన్ సాగర్లో అలనాటి బౌద్ధ వారసత్వాన్ని ఈ బుద్ధుని సందర్శించడం భవిష్యత్ తరాలకు ప్రేరణ కలిగించడం ప్రస్తుత సమాజానికి ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. దక్షిణ భారతంలో తెలంగాణా ప్రపంచ బౌద్ధ బిక్షువులకు బుద్ధవనం, హుస్సేన్ సాగర్ బుద్ధ, ఇతర బౌద్ధప్రదేశాలు కలిపి పర్యాటకంగా అభివృద్ధి చేస్తే, బౌద్ధ పర్యాటకులకు ఆరాధన కేంద్రాలుగా విలసిల్లగలవని వారు పేర్కొన్నారు.

# బుజ్జాయిలు వాటితో ఊసులాడుతారు..!







మబ్బులు, వర్షపు చుక్కలు, నక్షత్రాలు, సూర్య-చంద్రులు, బుజ్జి ఏనుగు, చిట్టి ఎలుక, మెడను ఆ బారున చాచే జిరాఫీ బొమ్మలు మనల్నే కాదు... అభం శుభం ఎరుగని చిన్నారుల్ని ఆకర్షిస్తాయి. వారి ఊయలకు కాస్త ఎత్తులో వీటిని వేలాడదీస్తే చాలు... వాటితో వచ్చీరాని భాషలో ఎన్ని ఊసులు చెబుతారో... అంతేనా, వాళ్ల కళ్లు ఎక్కువగా వాటినే గమనిస్తూ ఉంటాయి. తదేకంగా వాటిని చూస్తూ దృష్టి కేంద్రీకరిస్తారు. అవి గాలికి అటూ ఇటూ ఊగుతుంటే... బొమ్మల్ని చేతులతో తాకాలని, నోట్లో పెట్టుకోవాలని ఉత్సాహపడతారు. దాంతో కాళ్లు, చేతుల్లో కదలికలు వస్తాయి. ఓ రకంగా వ్యాయామం కూడా అవుతుంది. అలానే సెన్సరీ, కాగ్నిటివ్ నైపుణ్యాలూ అభివృద్ధి చెంది... నవ్వడం, అరవడం, కేకలు వేయడం వంటివి చేస్తారు. భాషానైపుణ్యాలకి బీజం పడేది కూడా ఇక్కడే. మరి పిల్లల అభివృద్ధికి ఇంత సహాయపడే వాటిని ప్లాస్టిక్ భయంతో వాళ్లకి దూరం చేస్తే ఎలా? 'ప్లాస్టిక్ బొమ్మలకు ఉండే కళ్లని పీకేసి పిల్లలు నోట్లో పెట్టుకుంటే ఇంకేమైనా ఉందా..' అంటారు అమ్మలు. మైక్రోప్లాస్టిక్స్ నోట్లోకి వెళతాయి. బ్యాటరీలు మింగేస్తారు లాంటి భయాలు చాలానే. అందుకే హ్యాంగింగ్స్ పెట్టడమే మానేశారు ఈతరం అమ్మలు. ఈ భయాలన్నింటికి చెక్ చెబుతూ వచ్చినవే... 'క్రోషె హ్యాంగింగ్స్'. ముద్దుగా, డెకరేటివ్ ఉపకరణాల్లా చూడముచ్చటగా ఉంటాయి. ఊలుతో అల్లుతారు కాబట్టి ప్లాస్టిక్ భయం అక్కర్లేదు. పర్యావరణహితం కూడా. ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకుంటే, నిశ్చింతగా వాటిని పిల్లలకు అందించొచ్చు. మీకూ నచ్చాయా? ఆన్‌లైన్ వేదికల్లో వెదికేయండి మరి!



















# ఇంట్లోనే జిమ్ కావాలంటే..!

**ఫిట్‌నెస్ సాధించాలంటే జిమ్‌కే వెళ్లాలా? అంటే.. ఆ అవసరం లేదంటున్నారు నిపుణులు. తక్కువ ఖర్చుతోనే ఇంట్లోనే ఓ మినీ జిమ్‌ను ఏర్పాటుచేసుకోవచ్చంటున్నారు. తద్వారా జిమ్ తరహా అనుభూతిని పొందడంతో పాటు ఖర్చునూ అదుపు చేసుకోవచ్చంటున్నారు. మరి, అదెలాగో తెలుసుకుందాం రండి..**



ఇంట్లోనే జిమ్‌ను ఏర్పాటుచేసుకోవాలంటే ముందుగా గుర్తుంచుకోవాల్సిన విషయం.. ఇంట్లో ఎంత ఖాళీ ప్రదేశం ఉందని! దీనికోసం ప్రత్యేకంగా ఓ గదిని కేటాయించగలరా? లేదంటే బాల్కనీలో ఏర్పాటుచేసుకుంటారా? అనేది నిర్ణయించుకోవాలి. అప్పుడే ఆ ప్రదేశాన్ని బట్టి జిమ్‌ను ఏర్పాటుచేసుకోవడం సులువవుతుంది. జిమ్ సెంటర్లో మాదిరిగా ఇంట్లోనూ అన్ని రకాల ఫిట్‌నెస్ మెషినరీ ఉండాల్సిన అవసరం లేదు. దానివల్ల ఇంట్లో ప్రదేశం, డబ్బు.. రెండూ వృథా! కాబట్టి మీరు చేరుకోవాల్సిన ఫిట్‌నెస్ లక్ష్యమేంటో ముందు నిర్ణయించుకోండి.. అందుకు ఉపయోగపడే జిమ్ మెషినరీ గురించి నిపుణుల్ని అడిగి తెలుసుకుంటే.. దాన్నే ఇంట్లో ఏర్పాటుచేసుకోవచ్చు. దీంతో పాటు ఒక యోగా మ్యాట్ తీసుకుంటే.. పులప్స్, పుషప్స్.. వంటి నేలపై చేసే వ్యాయామాలకు అనువుగా ఉంటుంది. జిమ్ మెషినరీపై డబ్బు వృథా ఎందుకు అనుకునే వారు.. ఇంట్లో ఉండే కొన్ని రకాల వస్తువుల్నీ వ్యాయామాల కోసం ఉపయోగించుకోవచ్చు. ఉదాహరణకు.. బరువైన వస్తువుల్ని వెయిట్ లిఫ్టింగ్ కోసం, పుషప్స్ కోసం బాస్కెట్ బాల్, జంపింగ్ కోసం స్కిప్పింగ్ రోప్, కార్డియో వ్యాయామాల కోసం మెట్లనూ ఉపయోగించచ్చు. ఫిట్‌నెస్ మెషినరీని ఎంచుకునే వారు.. ఒకే మెషీన్‌తో విభిన్న రకాల వ్యాయామాలు చేయగలిగేలా మల్టీపర్పస్ మెషీన్స్‌ని ఎంచుకుంటే డబ్బు.. ఇంట్లో స్థలం.. రెండూ ఆదా అవుతాయి. ఉదాహరణకు.. స్టెబిలిటీ బాల్‌తో కోర్ వ్యాయామాలు, యోగా.. వంటివి సాధన చేయచ్చు. ఇంట్లో జిమ్‌ను ఏర్పాటుచేసుకోవాలనుకునే వారు.. ఆ ప్రదేశంలో గాలి, వెలుతురు, ధారాళంగా ఉండేలా చూసుకోవాలి. ఎందుకంటే.. వ్యాయామం చేసే క్రమంలో శరీరం చెమటలు కక్కుతుంది. ఇలాంటప్పుడు గాలి తగలకపోయినా చిరాగ్గా అనిపిస్తుంటుంది. అలాగే సహజసిద్ధంగా బయటి నుంచి వచ్చే వెలుతురు మనసును ఉత్తేజితం చేస్తుంది. కొంతమంది ఇంట్లో గార్డెన్ ఉంటుంది. అలాంటి వారు తమ జిమ్ మెషినరీని ఆ పచ్చటి చెట్ల మధ్యలో ఏర్పాటుచేసుకోగలిగితే.. ఇటు మానసికోల్లాసం, అటు ఇంట్లో స్థలం కూడా ఆదా అవుతుంది. ఇక ఈ సదుపాయం లేని వారు.. తాము ఏర్పాటుచేసుకున్న జిమ్ ప్రదేశంలో ఇండోర్ ప్లాంట్స్ అమర్చుకోవచ్చు. మానసికోల్లాసం కోసం ఆ ప్రదేశాన్ని తమకు నచ్చినట్లుగా అలంకరించుకోవచ్చు.

# సినిమా




## అందుకే రిస్క్ చేసిన

యంగ్ హీరో విక్రాంత్, చాందిని చౌదరి జంటగా నటించిన తాజా చిత్రం సంతాన ప్రాప్తిరస్తు. మధుర ఎంటర్‌టైన్‌మెంట్ , నిర్వి ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీ ఈ నెల 14న రిలీజ్ కానుంది. దీంతో మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న విక్రాంత్ తన వ్యక్తిగత నేపథ్యం గురించి వెల్లడించాడు. అమెరికాలో ఆయనకు సాఫ్ట్‌వేర్ కంపెనీ ఉందట. అందులో 7 వందల మందికి పైగా ఉద్యోగులు పని చేస్తున్నారట. తమ సంస్థ మ్యూచువల్ ఫండ్ కంపెనీలకు సంబంధించిన సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ అందిస్తున్నట్లు చెప్పాడు. ఇండియాలో కూడా కంపెనీని విస్తరించే ప్రయత్నం చేయగా అనుకున్నట్లుగా రూపుదిద్దుకోలేదట. ఓ వైపు కంపెనీని నడుపుతూనే సినిమాల మీద ఇష్టంతో రిస్క్ తీసుకున్నట్లు తెలిపాడు.

## భయంతోనే వెళ్లలే..

సౌత్ ఇండస్ట్రీలో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు పొందిన మీనా బాలనటిగా కెరీర్ ప్రారంభించింది. తెలుగు, తమిళం, కన్నడలో అగ్రహీరోల సరసన నటించి మెప్పించింది. తన కెరీర్‌లో జరిగిన ఓ ఇంట్రెస్టింగ్ విషయాన్ని ఆమె తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించింది. సౌత్ ఇండస్ట్రీలో బిజీగా ఉన్నప్పుడు బాలీవుడ్ నుంచి ఆఫర్లు రాగా తిరస్కరించిందట. అప్పట్లో ఉన్న షూటింగ్‌ల కారణంగానే సరిగా నిద్ర, తిండి ఉండేవి కాదట. దీంతో బాలీవుడ్ కూడా అంటే తన వల్ల కాదని చెప్పిందట. అంతే కాకుండా అక్కడ షూటింగ్ టైమ్ ఎక్కువగా ఉంటుందనే భయంతో హిందీ సినిమాల వైపు వెళ్లలేదట. ఇక బాలీవుడ్ హీరో మిథున్ చక్రవర్తితో తనకు ఎదురైన అనుభవాన్ని గుర్తు చేసుకుంది. 'ఊటీలో మిథున్ చక్రవర్తికి ఓ హోటల్ ఉండేది. అప్పట్లో ఎక్కువ షూటింగ్‌లు ఊటీలోనే జరిగేవి. దీంతో స్టార్లందరూ ఆ హోటల్‌లోనే బస చేసేవారు. నేను అక్కడికి వెళితే ఆయన నా గది దగ్గరికి వచ్చి మనిద్దరం కలిసి ఎప్పుడు సినిమా చేద్దామని అడగడం ఇబ్బందిగా ఉండేది. కానీ తర్వాత చాలా బాధపడ్డాను' అని చెప్పుకొచ్చింది.



## ఓటీటీలోకి తెలుసు కదా

టాలీవుడ్ యూత్ స్టార్ సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన లేటెస్ట్ మూవీ 'తెలుసు కదా'. అక్టోబర్ 17న దీపావళి కానుకగా బాక్సాఫీసు ముందుకొచ్చిన ఈ చిత్రం మిక్స్‌డ్‌టాక్‌తెచ్చుకుంది. అయితే థియేటర్లలో ఈ సినిమాను మిస్ అయిన ప్రేక్షకులు త్వరలోనే డిజిటల్ ప్లాట్ ఫామ్‌లో వీక్షించే అవకాశం లభించింది. ఈ రొమాంటిక్ డ్రామా మూవీ తాజాగా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. ఈ నెల 14 నుంచి 'నెట్‌ఫ్లిక్స్'లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సినిమా దక్షిణ భారత భాషలన్నింటిలోనూ అందుబాటులోకి రానున్నట్లు సమాచారం. ఇక చిత్రంలో సిద్ధు సరసన రాశీఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటించారు. వైవా హర్ష, రోహిణీ, సంజయ్ స్వరూప్, రాజశ్రీ, అన్న పూర్ణ తదితరులు కీలక పాత్ర పోషించారు. ప్రముఖ కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ కోన ఈ మూవీతోనే దర్శకురాలిగా పరిచయమయ్యింది. ఎస్. ఎస్. తమన్ మ్యూజిక్ అందించగా.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి. విశ్వప్రసాద్, కృతిప్రసాద్ సంయుక్తంగా నిర్మించారు.







Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.